తప్పిపోయినాడు

"వయస్సు ఎనిమిది సంవత్సరములు. కుర్రాడు కొద్దిగా నలుపు. ఈడుకు తగ్గ ఎత్తుగా వుంటాడు. చొక్కా పై భాగంలో కొద్దిగా చిరిగివుంటుంది. కుర్రాడి పేరు వెంకటరమణ."

న్యూస్ పేపరు విప్పగానే 'తప్పిపోయినాడు' శీర్షిక క్రింద చదివాడు జోగారావు. కుర్రాడిని వెతికి తీసుకొచ్చినవారికి నూరు రూపాయల బహుమానం కూడా ఆ తండ్రి ప్రకటించాడు! క్రింద చిరునామా చూశాడు - తన వూరే! మొత్తంమీద తేలిన విషయం ఏమంటే - తన వూళ్ళోవుంటున్న నాగభూషణం అనే ఆయన చిన్నకొడుకు వెంకటరమణ తప్పిపోయాడు - వెదికి తీసుకొస్తే నాగభూషణంగారు నూరు రూపాయల రొఖ్ఖం చెల్లిస్తాడు!

జోగారావుకు వార్తా పత్రిక చూసే అలవాటు లేదు. ఎప్పుడన్నా - ఎవరన్నా కొంటే తను పక్కనవుంటే వోసారి తీసుకుని చూస్తాడు. అదన్నా ముందు ప్రకటనలు, ఆ తర్వాత వార్తలు. పత్రిక రెండో పేజీలో ఎడమచేతిపక్క పైభాగంలోవున్న ఈ 'తప్పిపోయినాడు' మీదికి జోగారావు కన్ను వెళ్ళింది! కుర్రాళ్లు ఇట్లా తప్పిపోవటం కొత్తకాదు. కుర్రాళ్ళే అన్నమాటేమిటి - పెద్దపెద్దవాళ్లే తప్పిపోతున్నట్టు చూస్తున్నాము. వీళ్ళెందుకిట్లా తప్పిపోతూవుంటారో జోగారావుకు అర్థం కాలేదు!

జోగారావు వార్తాపత్రికను జాగర్తగా దాని యజమానికి వప్పగించేసి, ఇంటి మొహం పట్టాడు. ఆ తర్వాత ఈ 'తప్పిపోయినాడు' గురించి అతను ఆలోచించనే లేదు!...

కాఫీ తాగి, సిగరెట్టు ముట్టించి, పొగ వదుల్తూ పెద్దరోడ్లూ, చిన్నరోడ్లూ దాటి వోసందుగుండా పోతున్న జోగారావుకు ఓ కుర్రాడు ఏడుస్తూ కనిపించాడు. మొదట్లో ఆ ఏడుపు విని 'ఏదోలే' అనుకున్నాడు. తర్వాత ఆసందులో ఇంకెవ్వరూ మనుషులు లేనందువల్లా కుర్రాడు వంటరిగా ఏడుస్తుండటంవల్లా - వాడికేసి చూశాడు. ఛటాలునఅతనికి వార్తాపత్రికా, అందులోని 'తప్పిపోయినాడూ' గుర్తొచ్చింది! త్వరగా కుర్రాడిదగ్గిరికిపోయాడు -

"ఇదిగో అబ్బాయ్-ఏం ఏమిటి - ఎందుకట్లా ఏడుస్తున్నావ్?"

కుర్రాడు జవాబూ చెప్పలేదు- ఏడుపూ మానలేదు. ఈ కుర్రాడిలో జోగారావుకు తను పత్రికలో చదివిన లక్షణాలు కనిపించినై. వయస్సు ఎనిమిది సంవత్సరాలుంటుంది.

"మాడూ అబ్బాయ్-ఏడవకూడదు. మీ యింటికి పోదామా?" అన్నాడు.

కుర్రాడు ఏడుపు మానలేదు.

"నీ పేరేమిటోయ్?"

కుర్రాడు సమాధానం లేదు. లాలించాడు- బెదిరించాడు-ఎన్ని చేసినా వాడు ఏడుపు మానలేదు. జోగారావుకు చిన్న చిరాకు వంటిది కలిగింది. అడిగినదానికి సమాధానం ఇవ్వడేం?—

రావి కొండలరావు

"నీ పేరు వెంకటరమణేనా?" అన్నాడు ఆఖరుకు. పత్రికలో పేరు గుర్తుకు తెచ్చుకుంటూ.

కుర్రాడు అవునన్నట్లు అనిపించింది జోగారావుకు. "పద- మీయింటికిపోదాం" అని చెయ్యి పట్టుకున్నాడు.

"వీధిలోకి పోయి అట్లా ఆ యేడు పేమిట్రా వెధవా - రా యింట్లోకి" అని వో కేక విన్నాడు జోగారావు. వెనక్కు చూశాడు- కుర్రాడితల్లి కాబోలు నించున్నది గుమ్మంలో. జోగారావు కుర్రాడిని తీసుకుని ఇంటిముందుకు పోయాడు.

"మీ అబ్బాయేనా యేమిటి? పాపం ఒకటే ఏడుపు!" అన్నాడు ఆమెతో. ఆమె సమాధానం యివ్వలేదు. ఆ కుర్రాడిని లాక్కుని, రెండు చరిచి, లోపలకు తీసుకుపోయింది! తప్పిపోయిన కుర్రాడు వీడు కాదన్నమాట! ఐనా యేదో ఆశవంటిది జోగారావులో పనిచేసి - "మీ అబ్బాయి పేరు వెంకటరమణేనా?" అన్నాడు లోపలకుచూస్తూ. "కాదు వెళ్ళవయ్యా" అన్నదామె కటువుగా. జోగారావు నిట్టూర్చి వెనక్కు తిరిగాడు. పోతూవుంటే వినిపించింది - "పిల్లల్ని ఎత్తుకుపోయే దొంగవెధవలు" అని.

జోగారావుకు గుండె ఝల్లుమన్నది. ఆ ప్రాంతాన ఇహ ఉండటం భావ్యం కాదని - త్వరత్వరగా నడిచి, సందుదాటి రోడ్డు దాటి - ఇల్లు చేరుకున్నాడు.

నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని మంచంమీద వాలేసరికి - జోగారావుకు వార్తా పత్రికా - ఆ శీర్షికా గుర్తొచ్చినై. ఆలోచించసాగాడు - ఆయన పేరు నాగభూషణం - అబ్బాయి పేరు వెంకటరమణ - కుర్రాడు కొద్దిగా నలుపు - చొక్కా చిరిగిపోయివున్నది - వాళ్లది ఈ వూరే. అన్నిటికంటె గొప్ప విషయం కుర్రాణ్ని తెస్తే - నూరు రూపాయల బహుమానం! "నూరు రూపాయలు!" ఈ 'నూరూ' తన చేతిలో నాగభూషణం వూరికే పోస్తున్నట్టు అనిపించింది అతనికి. ఈ అబ్బాయిని వెతకటం అన్నది ఏమంత కష్టమయిన పని కాదు. కుర్రాడు ఎనిమిదేళ్ళవాడు. అంటే ఏ వూరో పారిపోయివుంటాడనే ఆలోచనే రాదు. బహుశా ఏ పక్క యింటికో ఆటకుపోయి అక్కడనుంచి ఎక్కడికో వెళ్లి ఉంటాడు - ఆ వెళ్ళటంలో దారి తప్పివుంటాడు! ఐనా ఎనిమిదేళ్లవాడు దారి తప్పటం ఏమిటి? - వాడికి మాటలొస్తే తన పేరూ, తన తండ్రి పేరూ కూడా ఠక్కుంగా చెప్పగలడు! అంచాత కుర్రాడు తన యిష్టప్రకారమే తప్పిపోయి వుండాలి! ఇంట్లో ఎంచాతో తిడితేనో, కొడితేనో కుర్రాళ్లు ఇల్లు వదిలిపెట్టిపోతూ వుంటారు. ఊరవతల తోటల్లోనో-ఛాముగట్లమీదనో వుంటారు! అంతకు మినహా ఇంకేమీ చెయ్యలేరు. అటువంటిదేదో ఇప్పుడు జరిగి వుంటుంది. ఎనిమిదేళ్ల కుర్రాడు వొఖడూ వూరు విడిచి ఏ రైలో ఎక్కటం అంటే సాధారణమయిన విషయం కాదు. దానికి రెండు కారణాలు కనిపిస్తున్నై. మొదటిది

★ తప్పిపోయినాడు ★

కుర్రాడికి సాహసం వుండదు - రెండోది కుర్రాడికి సాహసంవున్నా రైల్వేవాళ్ళు వూరుకోరు! బహుశా మరోటి జరిగివుంటే? ఎవడన్నా కుర్రాడిని ఎత్తుకుని పారిపోతే?- వెంకటరమణ వంటిమీద బంగారం గాని, వెండిగాని వున్నట్టు ఏమీ కనిపించదు. చొక్కాకూడా పైన చింపుకున్నాట్ట!— ఇటువంటి కుర్రాడిని ఎవడెత్తుకుపోతాడు?

ఆలోచించి ఆఖరుకు ఓ నిర్ణయానికి వచ్చాడు జోగారావు. ఏమిటంటే- వెంకటరమణ యెక్కడికీ పోడు - ఈ వూళ్లోనే వుంటాడు - ఒక్కసారి తను వూరిచుట్టూ ప్రదక్షిణంచేస్తే తప్పక దొరికిపోతాడు — అంటే కొన్నిగంటలుకొద్ది శ్రమపడితే, నూరురూపాయలు వాటంతటవి వచ్చిపడతై. ఒకవేళ నాగభూషణంగారింటికివెళ్ళి ఇతర వివరాలుకూడా తెలుసుకుంటే తనకు వుపకరించవచ్చు అనుకొన్నాడు. కాని - అట్లా వెళ్ళటం బావుండదేమో! "మీ అబ్బాయిని వెతికి తెస్తాను" అంటే - ఆయన తనను మరోలాగా భావించి బహుమానం ఎగెయ్యవచ్చును. తను శ్రమపడి వెంకటరమణను వెతికి వప్పజెప్పటంవేరు- వాళ్ళింటికి వెళ్ళి మిగిలిన వివరాలు తెలుసుకుని - వాటినిబట్టి కుర్రాడిని వెతకటం వేరు! మొదటిదాంట్లో ఉన్నంతగొప్పతనం రెండోదాంట్లోవుండదు అదిగాక "ఆ వివరాలన్నీ ఇస్తే నువ్వేతీసుకు రావాలా ఏమిటి?" అని ఆయనంటే? — ఎందుకంటాడూ - ఇదేమన్నా పరీక్ష?— ఐనా తనంతటతను తిరిగి వెంకటరమణను పట్టుకోవాలి - నూరూ పుచ్చుకోవాలి!

జోగారావు ఛటాలున లేచి, మొహం కడుక్కొని బట్టలేసుకుని బయల్దేరాడు. ఎండ మాడుస్తున్నది. ఇటువంటి యెండలో తను ఇదివరకు తిరిగాడా? తిరిగాడు. ఐతే యీ తిరగటంలో అతనికి యేదో 'సాధించబోతున్నాను' అనే గొప్పతనం కనిపించింది. రోడ్లూ, సందులూ దాటి వూరవతలకు చేరుకున్నాడు. వెంకటరమణ ఇక్కడే ఈ ప్రాంతంలోనే వుంటాడని అతని నమ్మకం. దూరంగా ఏదో బస్సు పోతున్న శబ్దం మినహా అంతా నిశ్శబ్దంగా వున్నది. ఈ నిశ్శబ్దవాతావరణంలో ఎక్కడో వెంకటరమణ నిద్రపోతూ వుండాలి. రోడ్డు దిగి తోటల్లోకి దారి తీశాడు. ఆతోటల్లో చల్లగా వుంది. తోటలన్నీ తిరిగాడు - చెట్లకిందా, మీదా చూశాడు - గడ్డితోపులన్నీ గాలించాడు! ఎక్కడా ఏమీ కనిపించలేదు. ఇంకా తిరిగాడు - ఒకచోట ఎనిమిదేళ్లకుర్రాడు - సరిగ్గా ఎనిమిదేళ్ళవాడు కనుపించాడు! వాడికి చొక్కాలేదు - నల్లగా వున్నాడు. చిన్నలాగూ, చేతిలో వో బెత్తం మినహా ఇంకేం లేవు.

"వెంకటరమణా!" అన్నాడు దగ్గిరికి పోతూ.

ఆ కుర్రాడు బిత్తరపోయి అటూ యిటూ చూడసాగాడు.

వీడు వెంకటరమణే—చొక్కా ఎక్కడో పారేసి వుంటాడు.

"ఏం ఇక్కడున్నావ్? పోదాం పద" అన్నాడు నిక్కచ్చిగా.

"ఎక్కడికి బాబూ?" అనడిగాడు కుర్రాడుభయంతో.

మూల కారణం

"వారం రోజులుగా నిద్ర పట్టడంలేదండీ"

డాక్టర్: దానికి మూల కారణం ఏదో కనుక్కొని, దాన్ని నిర్మూలించాలి.

రోగి: మా పక్కవాటాలో ఆయనకి ఒక్కడే పిల్లాడండీ.

"షావుకార్" ఫిలిం ప్రఖ్యాత తార శ్రీమతి జానకి ప్రశంస,
"అందాన్నియిచ్చే సాధనాలలో 'డ్రాలీ' తో సమానం మరేదీ లేదు"—

S. Janaki.

ఆంధ్ర ఏజంట్లు: మెసర్సు పి. ఆర్. ట్రేడ్ ఏజెన్సీస్, విజయవాడ.

గడుసు కావాలి

"నాకు ఐదు రూపాయలు బాకీఅన్న సంగతి అప్పుడే మర్చిపోయావా?"

"అప్పుడే ఎలా మర్చిపోమ్మంటావ్ ... కొంచెం గడుసు కావాలి."

"మీయింటికి"

"మాయింటికా? ఎందుకూ?"

"ఎందుకేమిటి, మీ నాన్నగారు నీకోసం బెంగ పెట్టుకుంటూవుంటే"

"ఆఁ - నాన్నగారా? నాకెవరూ లేరే!"

కొతకొతాతేమో ననిపించింది జోగారావుకు. ఐనా కుర్రాడికి ఇంతకోత ఎట్లా వస్తుంది? -

"నీ కెవరూ లేరూ? మీ నాన్న పేరు?"

"నాకు తెలీదు."

"నీ పేరు?"

"చిన్నాంకడు"

జోగారావు వొక్కసారిగా నేలమీద కూలబడ్డాడు!

"ఏంచేస్తున్నావు నువ్విక్కడ?"

"గొర్రెల్ని కాసుకుంటున్నానుబాబూ!"

"ఏవీ?"

కుర్రాడు దూరంగా చూపించాడు. నిజమే - గొర్రెలు కనిపించినై!......

జోగారావు లేచాడు. లేవటానికి శక్తి వచ్చింది. పడిపోకుండా శరీరాన్ని బిగించుకుని నిటారుగా నించున్నాడు!....

దాహం వేసింది...

"నీళ్లు దొరుకుతాయా ఇక్కడెక్కి" అనడిగాడు.

"దొరుకుతై. అటెల్లండి."

కొంతదూరం వెళ్ళి గొర్రెల్ని దాటుకుని పోయి, వో చిన్న చెరువు చూశాడు. ఎండలో తళతళ మెరుస్తూ నిర్మలంగావున్న నీటిని చూస్తే జోగారావుకు నోరూరింది! త్వరత్వరగా కడుపునిండా నీళ్లుతాగి, మొహం కడుక్కుని నీడలోకివచ్చి కూచున్నాడు. దూరంగా ఎక్కడో వో కుర్రాడి ఏడుపు వినిపించింది. లేవబోయి, మళ్ళీ కూచున్నాడు. "వెంకటరమణా కాదూ నా శార్ధమూ కాదూ" అని గొణుక్కున్నాడు. వీడు ఎక్కడ వున్నాడో? ఎండ వొకటి! 'ఇంటికి పోతేనో' అనిపించింది. పోతే 'నూర్రూపాయలు' పోతాయి. అనువు-మరి విశే అవుతుంది - తను సాధించదల్చుకున్న మహత్కార్యం మొదటే సఫలీకృతం ఐపోతుందా! కాదు కాదు. ఎన్ని అవాంతరాలో వస్తాయి. అన్నిటినీ ఎదుర్కుంటూ తను ముందుకు సాగిపోవాలి! ఏ కష్టమూ పడకుండా 'నూరూ' అప్పణంగా చేతిలో కొస్తాయా యేమిటి?-

జోగారావుకు వుత్సాహం కలిగింది. సిగరెట్టుతీసి ముట్టించి, ఘాటుగా లాగి పొగ వదిలాడు. పోయిన శక్తంతా వొక్కసారి తిరిగొచ్చినట్టయింది - లేచాడు - వెంకటరమణ కోసం బయల్దేరాడు!

ఇటు పక్క తోటలూ, రోడ్లూ, పాడుపడ్డ దేవాలయాలూ అన్నీ వెతకటం ఐపోయింది. ఈసారి రైలుకట్టవేపు బండి నడిపించాడు. మామూలు రోడ్డమ్మటపోతే ఇటూ అటూ చెట్లుండి చల్లగా వుంటుంది గాని, ఈ రైలుపట్టాల పక్కన నీడను వూహించటానికే లేదు! నడుస్తున్నాడు...ఇటూ అటూ చూస్తున్నాడు - వెనక్కు తిరిగి చూస్తున్నాడు - ఎవడూ కనిపించటంలేదు. దూరంగా రైల్వేస్టేషను మాత్రం కనిపిస్తున్నది.

ఇంకా నడుస్తున్నాడు......

అటునుంచి ఎవడో వస్తున్నాడు - ముసలాయన. ఆయన వస్తూ వస్తూ "వెంకటరమణా" అని అరిచాడు! జోగారావుకు గుండె ఆగిపోయినంత పనయింది. తనమీద ఎవడో 'కాంపిటీషన్' తగిలాడు! ఈయనకూడా వెంకటరమణను వెతుకుతున్నాడు. ఇంతవరకూ తను పడిన శ్రమంతా వృథా అన్నమాట! అవునుమరి - నూరు రూపాయలకోసం ఎంత మందన్నా ప్రయత్నిస్తారు. తనొక్కడి స్వంతిమా యేమిటి? ముసలాయన రాకనుబట్టి చూస్తే ఈ కుర్రాడు అటుపక్క ఉండివుండడు— అంచాత తను వెనక్కు తిరిగి పోవటమే మంచిదేమో ననిపించింది. ముసలాయన మళ్ళీ "వెంకటరమణా" అని అరిచాడు. మళ్లీ జోగారావుకు గుండె ఆగిపోయినంత పనయింది. ఆయన తన్ను సమీపించాడు - జోగారావుకు 'తపీ'మని ఆలోచన తట్టింది - తనూ వెంకటరమణకోసమే బయల్దేరినట్టు తెలియరాదు!

"ఏమండీ - ఈ ఎండలో బయల్దేరారేం పాపం!" అన్నాడు జోగారావు అమని ఎరిగినట్టు. ముసలాయన రొగాదిగా చూసి "రాత" అన్నాడు.

ఆ 'రాత' తనకు తెలియదనుకున్నాడు కాబోలు! "వెంకటరమణ అనే కుర్రాడెవడో తప్పిపోయినట్టు నిన్న పేపర్లో చదివాను. మీకేమన్నా బంధువా?" అన్నాడు జోగారావు. ముసలాయన "ఉండవయ్యా కాళ్లు మాడిపోతున్నై" అన్నాడు చిరాగ్గా.

"చెప్పండి - మీకు బంధువా?"

"ఏడికాడు. ఎవడయ్యావాడూ?"

"మీరు పిలుస్తూపోతున్నారు -ఆ వెంకటరమణ."

"నీ మొహం - నేనెవడినీ పిలవ లేదు. నానెత్తి మాడిపోతూ నడవలేక, వెంకటరమణమూర్తిని తలుచుకుంటూవుంటే - 'పిలుస్తున్నారా' అంటావేమిటి మతిలేక?"

జోగారావు గుండె చరదరమని పనిచెయ్యటం మొదలుపెట్టింది! అమ్మయ్య - రక్షించాడు!

"అబ్బబ్బ ... ఏం ఎండ ఏం ఎండ ... రామచంద్రా - తిరుపతి వెంకటరమణా..." అంటూ సాగిపోయాడు ముసలాయన. జోగారావుకు ఎందుకో నవ్వొచ్చింది!

రైల్వేస్టేషను సమీపిస్తున్నది. జోగారావు జాగ్రత్తగా చూస్తున్నాడు. కుర్రాళ్లు-ముఖ్యంగా ఏడెనిమిదేళ్ల ప్రాయం వాళ్లు కావాలి! స్టేషన్ చాలా నిశ్శబ్దంగా వుంది-ప్లాటుఫారంమీద నీడలో పోర్టర్లు నిద్రపోతున్నారు. దగ్గరలో రావలసిన బండీ ఏదీ లేదు కాబోలు ప్రయాణీకులన్నా ఎవరూ లేరు!

స్టేషనంతా గాలించాడు. ఓమూల ముస్తైత్తుకుంటూ కుర్రాడొకడు కనిపించాడు. జోగారావు పరిశీలిద్దామని దగ్గిరికి పోబోతే, ఆ కుర్రాడు పరుగెత్తివస్తూ

పండిత డి. గోపాలాచార్యులవారి

అరుణా

గర్భాశయ రోగనివారిణి

ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్, మదరాసు-17.

★ తప్పిపోయినాడు ★

'బాబూ' అని చెయ్యి చాచాడు - అంతే! జోగారావు వెనక్కి తిరిగిపోయాడు. స్టేషన్‌మాష్టరు గదిలోకి చూశాడు. ఆయనకు విరామం దొరికిందని, నిద్రలో వున్నట్టున్నాడు. మరోగదిలో ఇంకెవరో నిద్రపోతున్నారు. అంతా నిద్రపోతూవుంటే తనేమిటో ఈ ఎండలో ఇట్లా తిరగటం? - కాస్సేపు ఈ 'వైటింగ్ రూమ్'లో విశ్రాంతి తీసుకునిపోతేనో? 'బాగానే వుంది' అనుకుని, రూమ్‌లోకొచ్చేసరికి ఆలోచన తట్టింది. తను నిద్రపోయి లేచేలోగా వెంకటరమణ ఎవడికన్నా దొరికిపోతే? - 'ఁ ప్ఫీ' మని వెనక్కి తిరిగి, కాసిన్ని మంచినీళ్లు తాగి, వెంకటరమణ దొరికేవరకూ నిద్రపోకూడదు అనుకుని, మళ్ళీ అన్వేషణలో పడ్డాడు!

జోగారావు వూళ్లోకొచ్చేసరికి సూర్యాస్తమయం ఐపోయింది. ఆకలి వేస్తున్నది. జేబులో చెయ్యి పెట్టిచూశాడు - మూడణాలు తగిలినై. హోటల్లో కాఫీ తాగాడు. సిగరెట్టుపెట్టెలో ఆఖరిసిగరెట్టు ముట్టించాడు. కాళ్లు స్వాధీనంలో లేవు! 'వెంకటరమణా' అనుకున్నాడు తనలో. ఆ కుర్రాడినే పిలిచాడో, భగవంతుడినే స్మరించాడోగాని రెంటికీ తగ్గట్టుగావుంది!

ఇంటికి చేరుకుని అరుగుమీద కూలబడ్డాడు. మధ్యాన్నంనుంచీ తను ఎండలో పడి, వూరవతిలంతా చూశాడు. ఎక్కడా వాడులేడు. అంచాత వూళ్లోనే వుండి వుండాలి - రాత్రి మరొక్కసారి సినిమా థియేటర్లపక్కనూ, బస్సుస్టాండులోనూ చూసేస్తే సరిపోతుంది!

ఎనిమిదిగంటలప్రాంతాన భోజనంచేసేసి మళ్ళీ బయల్దేరాడు జోగారావు.. సినిమా థియేటర్లూ బస్సుస్టాండూ, పేవ్‌మెంట్లూ అన్నీ వెతికాడు - అన్నీ చూశాడు. కొందరు కుర్రాళ్లు కనిపించారు. వాళ్లెవరూ 'వెంకటరమణలు' కారు! తిరిగి తిరిగి ఇల్లు చేరుకుని, తలుపు తడుతూవుంటే పక్కింటి గోడగడియారం పన్నెండు గంటలు కొట్టింది!

ఆరాత్రి జోగారావుకో చిత్రమయిన కల! తను వెంకటరమణను పట్టుకున్నాడు - తను పడిన శ్రమకు ప్రతిఫలంగా నాగభూషణం గారు నూరుకు మరి నూరు చేర్చి, నోట్లకట్టలు చేతిలోపెట్టి నమస్కరించారు! పెద్దగా సత్కారం చేశారు. ఏ మంత్రిగారికీ, కళాకారుడికీ జరగనటువంటి ఘనసన్మానం జరిగింది జోగారావుకు!

ఎనిమిదిగంటలయితేనేకాని లేవని జోగారావు ఆ మర్నాడు ఆరింటికే లేచాడు. పనులన్నీ ముగించుకుని, వుత్సాహంగా వూరిమీద పడ్డాడు. రాత్రి కల ఈరోజు నిజమయి తీర్తుంది! రెండు వందలూ, ఆ సన్మానం మాటకేంగాని - ఆ నూరు రూపాయలూ ఇస్తే చాలు - అంతకంటె ఇంకేం కావాలి! ఈసారి తప్పకుండా కుర్రాడు దొరుకుతాడని అతని అంతరాత్మ అంటున్నది! మళ్లీ వూరంతా తిరిగాడు - అన్ని చోట్లూ చూశాడు. ఏనాడూ చూడని ప్రదేశాలు ఈ మూలంగానన్నా తిరిగాడు!

తొమ్మిది గంటలకు హోటల్లో టిఫిన్ తిని బయటకొచ్చి సిగరెట్టు ముట్టించి - మళ్ళీ తిరిగాడు. చాలామంది కుర్రాళ్ళను అడుగుతున్నాడు. ఒకచోట 'వెంకటరమణ' అనే కుర్రాడు కనిపించాడు - ఐతే వాడి తండ్రిపేరు నాగభూషణం కాదట! మరోచోట నాగభూషణంగారి అబ్బాయే కనిపించాడు. ఐతే వాడిపేరు సూర్యప్రకాశరావు!

మళ్ళీ ఎండ ప్రారంభం. - నెత్తి మాడుతున్నది. వెంకటరమణ దొరకాలి - నూరు రూపాయలూ చేతిలో పోసుకునిగాని ఇంటిమొహం చూడరాదు అనే పట్టుదల ఓవేపు వుండనే వున్నది!......

షుమారు పన్నెండుగంటల ప్రాంతాన జోగారావుకు ఆ వీధిలో వెంకటరమణ కనిపించాడు! అవును - నిజమే - వెంకటరమణ కనిపించాడు!! అన్ని పోలికలూ వున్నై. ఆ కుర్రాడు వీధిలో నించుని - ఎలక్ట్రిక్ తీగల మధ్య చచ్చిపడివున్న గబ్బిలాన్ని చూస్తున్నాడు!

"నీ....నీ...నీ - పేరు వెంకటరమణేనా?"

కుర్రాడు అవునన్నాడు.

"మీ నాన్న గారి పేరు?"

సరిగ్గా చెప్పాడు! జోగారావుకు స్వర్గంలో విహరిస్తున్నట్టనిపించింది. నోటమ్మట కాస్సేపు మాట పెగల్లేదు! "మీ యింటికి పోదామా?" అన్నాడు.

"ఎందుకూ?"

"తప్పమ్మా - పద" కుర్రాణ్ని తీసుకుని నడిపించాడు.

"ఇదే మాయిల్లు" అన్నాడువెంకటరమణ.

అరి వీడిల్లు బంగారం గానూ - ఇంటిదగ్గరికే వచ్చి నించున్నాడన్నమాట! కాస్సేపు తను ఆలస్యంచేస్తే ఇంట్లోకిపోయివుండును - తన అదృష్టం!

"మీ నాన్న గార్ని రమ్మను"

కుర్రాడు లోపలికిపోయి నాగభూషణం గార్ని వెంటబెట్టుకొచ్చాడు.

"నమస్కారం. ఇదిగో మీ అబ్బాయి. మీ ప్రకటన చూశాను - చాలా శ్రమపడి, వెతికి తీసుకొచ్చాను"

> "మనిషిలా మాట్లాడే గాడిదని నేను చూశానండి."
>
> "మీ బొంద. గాడిద ఎలా మాట్లాడుతుంది?"
>
> "దానికే ముందండి. మనుషులు గాడిదల్లా మాట్లాడగలుగుతున్నపుడు, గాడిదలు మాట్లాడ్డంలో వింతేముంది?"

నాగభూషణం గారి మొహంలో కుర్రాడు దొరికాడన్న సంతోషం ఏమాత్రం కనిపించలేదు.

"క్షమించండి. కుర్రాడు ఎక్కడికీ పారిపోలేదు. పక్కయింట్లోనే వున్నాట్ట - మేము టెలిగ్రామ్ ద్వారా ప్రకటన పంపాము. ఆ తర్వాత కుర్రాడే వచ్చేశాడు!...కుర్రాడు వున్నాడని, ప్రకటన వెయ్యొద్దని పత్రికలవాళ్ళకు వైర్ చేశాము. అప్పటికే అది ముద్రణ అయిపోయిందట! అప్పట్నుంచీ ఇంట్లోనే ఉన్నాడు — ఇప్పుడే వీధిలోకెళ్ళాడు. ప్రకటనను వుపసంహరించుకున్నట్లు ఈరోజు పత్రికలో వుందే—చూడలేదూ?" అన్నాడు నాగభూషణం.

జోగారావు కాస్సూ చేతులూ అన్నీ గాల్లో తేలిపోయినై. మాట కట్టేసింది! కొన్ని క్షణాలపాటు గుండె కొట్టుకోటం మానేసింది!

జోగారావు కళ్ళు తెరిచి చూసేసరికి నాగభూషణం గారు అక్కడలేడు. వెంకటరమణమాత్రం మూడుచక్రాల సైకిలు తొక్కుతూ వాకిట్లో కనిపించాడు!! ★

పంచతంత్రం

బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-80

ఆంధ్రగ్రంథమాల మద్రాసు.